క్లుప్తంగా

కళాకారుల అభ్యున్నతికి కృషి

నల్లజర్ల: సకల కళాకారుల సంఘ సమావేశం శనివారం నల్లజర్లలో జిల్లా అధ్యక్షులు తలం శెట్టి మాధవరావు అధ్యక్షతన జరిగింది. సమావేశ వివరాలను సంఘ జిల్లా గౌరవ అధ్యక్షులు ఉన్నమట్ల వెంకటేశ్వరావు వెల్లడించారు. గతంలో అనారోగ్యంతో బాధపడే పేద కళాకారులకు రూ.5వేలు ఆర్థిక సాయం అందించే వారమని అది వచ్చే నెల నుంచి రూ.10వేలు చేయాలని సమావేశం తీర్మానించినట్టు చెప్పారు. చనిపోయిన కళాకారులకు దహన సంస్కారాలకు రూ.8వేలు అందించే వారమని దానిని పెంచాలని సమావేశం తీర్మానించినట్టు చెప్పారు. మానవత సభ్యులు, విద్యా కమిటీ చైర్మన్ ఆలపాటి నాగేశ్వరావు ప్రతి నెల రూ.3వేలు తమ సంఘానికి విరాళం అందించనున్నట్టు చెప్పారు. వారికి సమావేశం అభినందనలు తెలిపింది. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి తవ్వా నరసింహరావు, మండలశాఖ అధ్యక్షులు పత్తిపాటి గంగారావు, కార్యదర్శి మోడేపల్లి నాగబ్రహ్మాచారి పాల్గొన్నారు.

పాడి రైతులకు పశుదాణా పంపిణీ



రైతులకు పశువుల దాణా పంపిణీ చేస్తున్న తహసీల్దార్ మెరికమ్మ

చాగల్లు: పాడి రైతులు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎం.మెరికమ్మ అన్నారు. చాగల్లు మండలంలో పాడి రైతులకు 50% సబ్సిడీపై పశువుల దాణాను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక రైతు సేవాకేంద్రం వద్ద జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ మెరికమ్మ దాణాను రైతులకు పంపిణీ చేశారు. పశువైద్యాధికారి ఎం.ముఖేష్ మాట్లాడుతూ ముందుగా రైతువాటా చెల్లించి నమోదు చేసుకున్నవారికి ప్రస్తుతం దాణా సరఫరా చేశామని, భారత్ పశుధన్ యాప్‌లో నమోదు కాబడిన, తెల్ల రేషన్ కార్డు గల రైతులకు ఈ సబ్సిడీ దాణా వర్తిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, పాడిరైతులు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్ర సాధనకు సమష్టి కృషి



సమిశ్రగూడెంలో ఉపాధి కూలీలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

నిడదవోలు రూరల్: స్వచ్ఛాంధ్ర సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మండల ప్రత్యేకాధికారి ఎ.దుర్గేష్ అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని సమిశ్రగూడెంలో వేసవిలో వడ దెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలంటే పారిశుధ్యంపై దృష్టి పెట్టాలన్నారు. అనంతరం ప్రధాన చెరువు వద్ద శ్రమదానం నిర్వహించారు. చలివేంద్రం వద్ద మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దేశాబత్తుల జ్యోత్స్న ప్రియాంక, తహసీల్దార్ నాగరాజు నాయక్, డీపీఆర్సీ జిల్లా ట్రైనీ ప్రసంగిరాజు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ ఎండీ అక్రం, స్థానిక నాయకులు ఉప్పులూరి రామ్మోహన్‌రావు, గోగిన శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న దివాన్ చెరువు నరస చెరువు ప్రాంతానికి చెందిన ఆకుల గోవిందరావు (50) శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. ఆకుల గోవిందరావు తన భార్యతో గొడవపడ్డాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం సమయంలో గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. అతడిని చికిత్స కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతడి కుమారుడు ఆకుల రమణ ఫిర్యాదు మేరకు బొమ్మూరు ఎస్సై మురళీ మోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాణ్యత ప్రమాణాలు పాటించకుంటే చర్యలు

రాజమహేంద్రవరం సిటీ: పెట్రోలు బంకుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించకుంటే చర్యలు తీసుకుంటామని లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ శివ బాలాజీ హెచ్చరించారు. ప్రపంచ లీగల్ మెట్రాలజీ వారోత్సవాల్లో భాగంగా శనివారం రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు పెట్రోల్ బంక్ వద్ద వినియోగదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వినియోగదారుల రక్షణ మండలి సభ్యుడు గొట్టిముక్కల అనంతరావు మాట్లాడుతూ ప్రతి వినియోగదారుడు పెట్రోలు నాణ్యత, పరిమాణం సరిచూసుకోవాలని సూచించారు. ఫిర్యాదులేమైనా ఉంటే 1967కు తెలపాలన్నారు. ప్రతి పెట్రోలు బంకులో తాగునీరు, మరుగుదొడ్లు, గాలి, ఫస్ట్ ఎయిడ్ కిట్ ఉచితంగా అందించాలన్నారు. అనంతరం అధికారులు బంకులో తనిఖీలు చేశారు.

దారులన్నీ ఇసుకమయం.. ప్రమాదాలు నిత్యకృత్యం!

- రహదారులపై ఇష్టారాజ్యంగా ఇసుక లారీల రాకపోకలు
- రోడ్లపై పడుతున్న ఇసుక
- తరచూ ప్రమాదాలు
- ఏటిగట్టు రోడ్డు చెంతనే ఇసుక స్టాక్ పాయింట్ల ఏర్పాటు
- చోద్యం చూస్తున్న అధికారులు



కుమారదేవం ఏటిగట్టు రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన ఇసుక స్టాక్

తాళ్లపూడి(కొవ్వూరు): కూటమి ప్రభుత్వంలో అన్నింటా అధికార పార్టీ నాయకుల హవా కొనసాగుతోంది. మరోపక్క అధికార పార్టీ నాయకుల అండదండలతో ఇసుక ర్యాంపుల్లో అక్రమ ఇసుక తవ్వకాలతో ఇసుక మాఫియా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఇదిలా ఉంటే రహదారులపై ఇసుక లారీల రాకపోకలు, మరోపక్క కొత్తగా ఏర్పాటు చేస్తున్న స్టాక్ పాయింట్లు ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. కొవ్వూరు నియోజకవర్గంలోని ఇసుక ర్యాంపుల్లో ఉచిత ఇసుక మాటున అక్రమ ఇసుక వ్యాపారం జోరుగా సాగుతుంది. ఇసుక లారీల కారణంగా రోడ్లపై ప్రయాణం చేయాలంటేనే వాహనదారులు భయపడిపోతున్నారు. పరిమితికి మించి అధిక ఇసుక లోడుతో వెళుతున్న లారీల నుంచి ఇసుక జారిపడుతోంది. రోడ్ల పైనా, రోడ్లపక్క ఎక్కడ చూసినా ఇసుక మేటలు మాదిరిగా దర్శనమిస్తున్నాయి. దీంతో రహదారిపై వెళ్లే వాహన చోదకులు జారిపడి ప్రమాదాల బారిన పడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే రోడ్లపై పరిమితికి మించి వేగంగా వెళ్లే ఇసుక లారీలతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

కొవ్వూరు నుంచి ప్రక్కిలంక వరకు గోదావరి ఏటి గట్టు రోడ్డుపై నుంచి నిత్యం అధిక సంఖ్యలో వెళుతున్న ఇసుక లారీలు, ట్రాక్టర్ల నుంచి క్రిందికి జారిపోయిన ఇసుక ఆర్అండ్‌బీ రోడ్డుపై పేరుకుపోతోంది. దీంతో అటుగా వెళ్లే వాహనాలు అదుపు తప్పి వాహనదారులు తరచూ ప్రమాదాల పాలవుతున్న పరిస్థితులు నెలకొంటున్నాయి. నిబంధనల మేరకు ఇసుక లోడ్‌తో వెళ్లే వాహనాలపై టార్పాలిన్ కప్పాలి. నిబంధనలను తుంగలో తొక్కుతున్న ఇసుక రవాణాదారులు టార్పాలిన్‌లు కప్పకుండానే ఇష్టారాజ్యంగా ఇసుక రవాణా చేస్తున్నారు.

స్టాక్ పాయింట్లతో కొత్త చిక్కులు

వర్షాకాలంలో ఇసుక కొరత లేకుండా ఉండడానికి గానూ ఇసుక ర్యాంపుల నిర్వాహకులు స్టాక్ పెట్టాలని మైనింగ్ అధికారులు అనుమతులు ఇచ్చినట్టు చెబుతున్నారు. అయితే స్టాక్ పాయింట్లు ఎక్కడ పెట్టాలి అన్నదానిపై స్పష్టత లేకపోవడంతో ర్యాంపుల నిర్వాహకులు కొవ్వూరు నుంచి కుమారదేవం వరకు పలు చోట్ల ఏటి గట్టు రోడ్డు పక్కనే ఇసుక స్టాక్ పెడుతున్నారు. ముఖ్యంగా కుమారదేవం గండిపోశమ్మ ఆలయం సమీపంలోనూ, ఆరికిరేవుల వద్ద, కొవ్వూరు గామన్ బ్రిడ్జి సమీపంలో ఇలా పలు చోట్ల గోదావరి గట్టుకు అనుకుని పీడబ్ల్యూ స్థలంలోనూ, గట్టుకు అనుకుని ఉన్న ప్రయివేట్ వ్యక్తుల చేలల్లో ఇసుక స్టాక్ పెడుతున్నారు. దీంతో ఇసుక రోడ్డుపైకి చేరుతుంది. పైగా స్టాక్ పాయింట్‌కు నిత్యం వెళ్లే లారీలతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా ఇసుక తరలిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే వర్షాకాలంలో మళ్లీ ఇసుక తరలించే సమయంలో మరింత ఇబ్బంది పడాల్సి వస్తుందని అంటున్నారు. ఉన్నతాధికారులు దీనిపై చర్యలు తీసుకోవాలని ఒక వేళ స్టాక్ పాయింట్లకు అనుమతి ఉంటే ఏటి గట్టుకు దూరంగా స్టాక్ పెట్టే ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

వాహనదారుల అవస్థలు

కొవ్వూరు మండలం కుమారదేవం, ఆరికిరేవుల, చిడిపి, కొవ్వూరు ఇసుక ర్యాంపుల నుంచి, తాళ్లపూడి మండలం బల్లిపాడు, ప్రక్కిలంక, తాళ్లపూడి ఇసుక ర్యాంపుల నుంచి ఇసుక రవాణా చేసే సమయంలో ఏటిగట్టు రోడ్డుపై ఇసుక జారీ పడడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పరిమితికి మించి లోడు వేయడంతో రోడ్లన్నీ ఇసుక మేటలతో దర్శమిస్తున్నాయి. వాహనలు వెళ్లేటప్పుడు దుమ్ము కూడా లేచిపోతుంది. దీంతో ఈ మార్గంలో ప్రయాణం నరకప్రాయంగా మారుతోంది. పరిమితికి మించి లోడు వేసినా, రాత్రీపగలు తేడా లేకుండా అతివేగంతో లారీలు నడుతున్నా సంబంధిత శాఖాధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు.

నిత్యకృత్యంగా ప్రమాదాలు

ఇటీవల ఆరికిరేవుల వద్ద ఇసుక లారీ, ట్యాంకర్‌ను ఢీకొన్న సంఘటన చోటు చేసుకుంది. మరోచోట కొవ్వూరు గామన్ బ్రిడ్జి వద్ద ఇసుక లారీ స్కూటీని ఢీకొట్టడంతో స్కూటీపై ప్రయాణిస్తున్న మహిళ మృతి చెందింది. ఇలా తరచూ పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నా పట్టించుకునేవారు లేక ప్రజలు భయభ్రాంతులకు లోనవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు

> ఆర్అండ్‌బీ రోడ్లపై ఇసుక పేరుకుపోకుండా పటిష్ఠ చర్యలు చేపడుతున్నాం. ముఖ్య కూడళ్లలో స్పీడు బ్రేకర్లు వేయటం జరిగింది. ప్రతి ర్యాంపు వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటుతో పాటు ఇసుక తరలించే వాహనాలపై బరకాలు కప్పడం, రీచ్‌లకు వెళ్లే దారుల్లో మిర్రర్‌లు ఏర్పాటు వంటి చర్యలు చేపట్టాలని ఆదేశాలిచ్చాం.
>
> మోహన భారతి, తహసీల్దార్, తాళ్లపూడి.



ఆరికిరేవులు వద్ద ఏటిగట్టు రోడ్డు పక్కన భారీగా ఇసుక స్టాక్ పాయింట్



కొవ్వూరులో ఏటిగట్టు రోడ్డు పక్కన భారీగా ఇసుక నిల్వలు



కొవ్వూరులోని గోదావరి మాత విగ్రహం సమీపంలో రోడ్డుపై ఇసుక మేట



కుమారదేవం వద్ద రోడ్డు పక్కన స్టాక్ పాయింట్‌లో ఇసుక అన్‌లోడ్ చేస్తున్న లారీలు

గుండెపోటుతో వైఎస్సార్ సీపీ నాయకుడి మృతి



గవర సర్వారాయుడు

చాగల్లు: చాగల్లుకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు గవర సర్వారాయుడు శనివారం సాయంత్రం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతిపట్ల మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు, మాజీ సర్పంచ్ గంద్రోతు సురేంద్రకుమార్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జుట్టా కొండలరావు, బొర్రా రజనీ ప్రసాద్ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

కిలో రూ.500కు కోకో గింజల కొనుగోలు చేయాలి

నిడదవోలు: కోకో గింజలను కిలోకు రూ.500 ధరకు కొనుగోలు చేసేందుకు మాండలీజ్ సంస్థ అంగీకరించిందని మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. కోకో పంట ఉత్పత్తులకు ధర లేకపోవడంతో ఆందోళనకు దిగిన రైతులకు భరోసానిస్తూ పట్టణంలో మంత్రి క్యాంపు కార్యాలయంలో శనివారం అధికారులు, ట్రేడర్లు, రైతులతో కోకో కొనుగోళ్లు, గిట్టుబాటు ధరలపై మంత్రి చర్చించారు. రైతులు అహర్నిశలు శ్రమించి పండించిన కోకో గింజలకు గిట్టుబాటు ధర కల్పించాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు. రైతులకు, కంపెనీలకు మధ్య అనుకూల వాతావరణం ఉండాలని, కంపెనీలు రైతు పక్షపాతిగా వ్యవహరించాలని సూచించారు. కోకో రైతులు సాగు చేసిన చివరి గింజ వరకు కొనుగోలు జరపాలని ఆయన ఆదేశించారు. కోకో రైతులను ప్రభుత్వం పరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత, తహసీల్దారు నాగరాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

'మద్యం కేసు రాజకీయ ప్రేరేపితమే'

- కక్ష సాధింపులో భాగంగానే అక్రమ కేసులు, అరెస్టులు
- పాలనా వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్
- మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు



మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

చాగల్లు: మద్యం కేసు రాజకీయ ప్రేరేపితమని, ఏపీలో రాజకీయ కక్షలతోనే అక్రమ కేసులు పెడుతున్నట్టు సుప్రీంకోర్టుకు సైతం అర్థమైందని మాజీ ఎమ్మెల్యే, కొవ్వూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు అన్నారు. చాగల్లులో శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ చంద్రబాబు నీచ రాజకీయాలు చేస్తున్నారని, పాలనా వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని అన్నారు. లిక్కర్ వ్యవహారంలో ఆధారాలు లేకపోయినా అరెస్టులు చేస్తుండటం దారుణమని అన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌ని టార్గెట్ చేసుకుని అక్రమ కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ అరాచకాలను ప్రజలు చూస్తున్నారని అన్నారు. స్కిల్ కేసులో చంద్రబాబు 53 రోజులు జైలులో ఉన్నారు. దాని మీద ఒక్కరోజైనా మాజీ సీఎం వైఎస్ జగన్‌ని జైల్లో ఉంచాలని చంద్రబాబు తొందర పడుతున్నారన్నారు. 'స్కిల్ కేసులో చంద్రబాబే స్వయంగా అక్రమాలకు పాల్పడ్డారు. నిధుల విడుదల అక్రమమని తెలిసినా నిబంధనలకు విరుద్ధంగా డబ్బులు డ్రా చేశారని, ఆధారాలతో సహా స్కిల్ కేసులో దొరికారు' అని తలారి వెంకట్రావు గుర్తు చేశారు. మాజీ సీఎం జగన్‌కు సంబంధం లేని లిక్కర్ కేసును తెర మీదకు తెచ్చి హడావిడి చేస్తున్నారని ఆయన ఎక్కడైనా సంతకాలు పెట్టారా అని ప్రశ్నించారు. ఈ కేసులో తమకు వత్తాసు పలికే అధికారి ఆధ్వర్యంలో సిట్‌ను వేసి లిక్కర్ కేసు నడుపుతున్నారన్నారు. జగన్ అరెస్టే లక్ష్యంగా కేసు నడుపుతున్నారని ఆరోపించారు. ఇందు కోసం ఎన్ని పాపాలు, తప్పులు చేయాలో అవన్నీ సిట్‌తో చేయిస్తున్నారని అన్నారు. టీడీపీ కార్యాలయం నుంచి వాట్సాప్‌లో వచ్చిన ప్రశ్నలను సిట్ అధికారులు ప్రశ్నిస్తున్నారని విమర్శించారు. ఎన్ని అక్రమ కేసులు పెట్టినా జగన్ వెనకడుగు వేయరని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాలనలో మహిళలకు ఆసరా, చేయూత, సున్నా వడ్డీ, అమ్మ ఒడి, పక్కా గృహాలు, పెళ్లి కానుక తదితర అనేక పథకాలను అమలు చేస్తే.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిపై ఉక్కుపాదాన్ని మోపిందన్నారు. ఇసుక, మట్టి, మద్యం నుంచి భూ కేటాయింపుల వరకు అన్నింట్లోనూ అవినీతికి పాల్పడుతోందని దుయ్యబట్టారు.

పండ్ల తోటల సాగుకు చేయూత

ఉపాధి హామీ పథకం ఏపీఓ వెంకట్రావు



నల్లజర్ల: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటల పెంపకానికి ఆర్థిక సాయం అందిస్తున్నట్టు ఏపీఓ వెంకట్రావు తెలిపారు. సన్న, చిన్నకారు రైతులకు వందశాతం రాయితీ అందిస్తారన్నారు. మెట్ట,బీడు భూములు సాగులోకి తీసుకురావడంతో పాటు జలవనరుల సంరక్షణ చర్యలు తీసుకుంటారన్నారు. పండ్ల తోటల పెంపకంతో పాటు నీటి కుంటల నిర్మాణం చేసుకుంటే వర్షం నీటిని ఒడిసిపట్టుకొని మొక్కల సంరక్షణ చేసుకోవచ్చన్నారు. చిన్న, సన్నకారు రైతులు ప్రభుత్వ ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ పథకం ద్వారా మండలంలో 250 ఎకరాలలో పండ్ల తోటల పెంపకానికి ప్రణాళిక వేసినట్లు చెప్పారు. మామిడి, జామ, దానిమ్మ, కొబ్బరి, సీతాఫలం, అల్లనేరేడు, సపోటా, నిమ్మ తోటలు సాగుచేసుకోవచ్చునన్నారు.

మూడేళ్ల పాటు సాయం

తోటల పెంపకం చేపట్టే రైతులకు మూడేళ్ల పాటు దశల వారీగా ఆర్థిక సాయం అందుతుందన్నారు. నిమ్మ, జామకు గరిష్ఠంగా రూ.1.40 లక్షలు అందుతుందన్నారు. రైతు జాబ్‌కార్డు కలిగి ఉండాలన్నారు. ఐదెకరాలలోపు భూమి, బోరు, మెట్ట భూములలో వేసుకోవచ్చునన్నారు. ఈపథకం సన్న, చిన్న కారు రైతులకు వరం లాంటిదన్నారు. రైతులు ఆర్థికంగా ఎదిగేలా ఉపయుక్తమన్నారు. వర్షాలు ప్రారంభంతో ఈ పథకం ప్రారంభమవుతుందన్నారు.ఆశక్తిగల రైతులు మండల, క్షేత్రస్థాయి ఉపాధి హామీ సిబ్బందిని సంప్రదించాలన్నారు.

ఆక్రమణల తొలగింపు అడ్డగింత

- అధికారులను అడ్డుకున్న గ్రామస్తులు
- కోర్టు ఉత్తర్వులతో వెనుదిరిగిన అధికారులు



దేవరపల్లి మండలం కృష్ణంపాలెంలో ఆక్రమణల తొలగింపును అడ్డుకున్న గ్రామస్తులు

దేవరపల్లి: గుండుగొలను-కొవ్వూరు జాతీయ రహదారి(పాతది) ప్రక్కన దేవరపల్లి మండలం కృష్ణంపాలెంలో గల ఆక్రమణల తొలగింపునకు అధికారులు చర్యలు చేపట్టారు. రెండు జేసీబీ యంత్రాలతో నేషనల్ హైవే, రెవెన్యూ, ఆర్అండ్‌బీ, పంచాయతీ రాజ్ అధికారులు గ్రామానికి చేరుకుని ఆక్రమణల్లో ఉన్న రైతు తేతలి వెంకట్రామి రెడ్డి(శ్రీనివాసరెడ్డి)కి చెందిన పొగాకు బ్యారన్లను తొలగించడానికి సిద్ధమవుతుండగా గ్రామస్తులు, వెంకట్రామి రెడ్డి కుటుంబ సభ్యులు అడ్డుకున్నారు. రోడ్డు ప్రక్కన బ్యారన్లు, ఇళ్లు నిర్మించుకున్న ఆరుగురు వ్యక్తులకు తనతో పాటు నోటీసులు ఇచ్చారని, వాటన్నిటిని తొలగించిన తర్వాత తన బ్యారన్లు తొలగించాలని వెంకట్రామిరెడ్డి కుటుంబ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు సత్తి జగదీశ్వరరెడ్డి, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు సత్తి సాయిఈశ్వరరెడ్డి, మహిళలు అడ్డుకున్నారు. బ్యారన్ల తొలగింపుపై కోర్టు ఉత్తర్వులు ఉన్నందున తొలగించవద్దని అధికారులకు వివరించారు. కోర్టు ఉత్తర్వుల కాపీలను వెంకట్రామిరెడ్డి అధికారులకు అందజేశారు. దీంతో అధికారులు ఆలోచనలో పడ్డారు. పంచాయతీ కార్యదర్శి నిర్ణయం మేరకు ఆక్రమణల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని కోర్టు ఉత్తర్వుల్లో పేర్కొనడంతో అధికారులు గ్రామ పంచాయతీ కార్యాలయంలో కొద్ది సేపు చర్చలు జరిపారు. కోర్టు తదుపరి ఉత్తర్వులు, పంచాయతీ కార్యదర్శి నిర్ణయం మేరకు ఆక్రమణల తొలగింపుకు తదుపరి చర్యలు తీసుకోవడానికి అధికారులు నిర్ణయం తీసుకుని ఆక్రమణల తొలగింపును నిలుపుదల చేశారు. గ్రామంలో జాతీయ రహదారికి స్థలాన్ని ఆక్రమించి బ్యారన్లు, కట్టడాలు నిర్మించారని, వాటిని తొలగించాలని గ్రామానికి చెందిన కరుటూరి సత్యనారాయణ ఫిర్యాదు చేసినట్టు తహసీల్దార్ ఎం. శ్రీనివాసరావు తెలిపారు. కోర్టు తదుపరి ఉత్తర్వుల మేరకు ఆక్రమణల తొలగింపునకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. నేషనల్ హైవే డిప్యూటీ తహసీల్దార్ రమణ, తహసీల్దార్ ఎం. శ్రీనివాస్, ఆర్అండ్‌బీ ఏఈ శ్రీనివాసరావు, ఎంపీడీఓ ఎస్. వేణుగోపాల్‌రెడ్డి, వీఆర్వో బాషా, సర్పంచ్ ప్రసాద్ ఆక్రమణలను పరిశీలించారు. రోడ్డు ప్రక్కన స్థలాన్ని ఆక్రమించుకుని కట్టడాలు నిర్మించిన ఆరుగురు వ్యక్తులకు నోటీసులు అందజేసినట్టు పంచాయతీ కార్యదర్శి సీహెచ్ బాలు తెలిపారు.

సాంకేతికతతో కేసుల సత్వర పరిష్కారం

ఏలూరు రేంజ్ ఐజీ అశోక్ కుమార్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఐజీ అశోక్‌కుమార్

ఉండ్రాజవరం: సాంకేతికతను వినియోగించుకుని కేసులు త్వరగా పరిష్కరిస్తున్నామని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ఉండ్రాజవరం పోలీస్‌స్టేషన్‌ను ఆయన శనివారం తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్‌లో ఉన్న దస్త్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. దర్యాప్తులో ఉన్న కేసుల వివరాలు, లోటుపాట్లను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులపై సరైన రీతిలో క్షుణ్ణంగా విచారణ జరిపి నిర్దిష్ట సమయంలో పరిష్కరించాలన్నారు. ఇటీవల జరిగిన దొంగతనాల్లో భాగంగా వివిధ కేసుల్లో సీసీ కెమెరాల ఆధారంగా దొంగలను త్వరగా అరెస్ట్ చేయగలిగామన్నారు. గంజాయిపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. పోక్సో కేసులో అరెస్ట్ అయిన వ్యక్తి బయటకు వచ్చిన తరువాత కచ్చితంగా నిఘా పెడతామన్నారు. ముందుగా పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆయన మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ డి.నరసింహ కిషోర్, ఏఎస్పీ అల్లూరి సుబ్బరాజు, డీఎస్పీ జి.దేవకుమార్, సీఐ పివిజి.తిలక్, ఎస్సై గుబ్బల శ్రీనివాస రావు, సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్ఐవీపై కళాజాత

సీటీఆర్ఐ: హెచ్ఐవీ, ఎయిడ్స్‌లపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని చేంజస్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కె.పుష్పకుమారి అన్నారు. ఏపీ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల ప్రకారం జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ, చేంజస్ సంస్థ ఆధ్వర్యంలో నగరంలో కళాజాత నిర్వహిస్తున్నారు.

పొక్లెయిన్ ఆపరేటర్ల సమ్మె విరమణ

- కుదిరిన వేతన ఒప్పందం
- రూ.3 వేల అదనపు వేతనం

దేవరపల్లి: వేతన ఒప్పందం చేయాలని క్వారీ క్రషర్ల యజమానులను డిమాండ్ చేస్తూ దేవరపల్లి, కొవ్వూరు మండలాల్లోని క్వారీల్లో పొక్లెయిన్లపై పనిచేస్తున్న ఆపరేటర్లు చేపట్టిన సమ్మెను విరమించినట్టు ఐఎఫ్‌టీయూ నాయకులు సీహెచ్ రమేష్, పి.నాగేశ్వరరావు తెలిపారు. ఏప్రిల్ 22 నాటికి గత వేతన ఒప్పందం కాలపరిమితి ముగియడంతో నూతన వేతన ఒప్పందం కోసం కార్మికులు యజమానులకు ఏప్రిల్ 7న పలు డిమాండ్లతో కూడిన నోటీసు అందజేశారు. దీనిపై యజమానుల నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో సమ్మె చేపట్టారు ఈ నెల 9వ తేదీ నుంచి కార్మికులు దేవరపల్లి మండలం గౌరీపట్నం పరిధిలోని కొండగూడెంలో శిబిరం ఏర్పాటు చేసి సమ్మె చేపట్టారు. ఈ నెల 15న ది వెస్ట్ గోదావరి క్వారీ క్రషర్ల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గౌరీపట్నంలో కార్మికులు, యజమానుల మధ్య చర్చలు జరిగాయి. చర్చలు విఫలం కావడంతో కార్మికులు సమ్మె కొనసాగిస్తున్నారు. శనివారం కొవ్వూరు ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ రాణి సుస్మిత ఆధ్వర్యంలో రెవెన్యూ, కార్మిక శాఖ అధికారుల సమక్షంలో యజమానులకు, కార్మికులకు చర్చలు జరిపారు. చర్చల్లో ప్రస్తుతం అమలులో ఉన్న వేతనంపై అదనంగా నెలకు రూ. 3 వేలు ఇవ్వడానికి యజమానులు అంగీకరించడంతో చర్చలు విజయవంతం అయ్యాయి. దీంతో ఆదివారం నుంచి సమ్మె విరమిస్తున్నట్టు ఐఎఫ్‌టీయూ నాయకులు రమేష్, నాగేశ్వరరావు తెలిపారు. సుమారు 200 మంది కార్మికులు ఆపరేటర్లుగా పనిచేస్తున్నారు. నూతన వేతన ఒప్పందం మూడేళ్లు అమలులో ఉంటుందని నాగేశ్వరరావు తెలిపారు.

భారీ వర్షంతో ఊరట

నిడదవోలు రూరల్: మండలంలోని సమిశ్రగూడెం, డి ముప్పవరం, గోపవరంలో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఉదయం నుంచి ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది. ఎండ ప్రభావంతో వడగాల్పులు వీశాయి. ఇంటి నుంచి బయటకు రావాలంటే ప్రజలు భయపడ్డారు. మధ్యాహ్నం మూడు గంటలకు ఒక్కసారిగా వాతావరణం చల్లబడి వర్షం కురిసింది. దీంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

పట్టణాభివృద్ధికి సంపూర్ణ కృషి

నిడదవోలు : రాష్ట్రంలోనే నిడదవోలు పట్టణాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి పథంలో నిలిపేందుకు కృషి చేస్తున్నట్లు రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో శనివారం విలేకర్ల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ పట్టణాభివృద్ధి కోసం రూ.105.80 కోట్ల నిధులతో వివిధ పనులు చేపడుతున్నామన్నారు. మున్సిపాలిటీ సాధారణ నిధుల నుంచి రూ.15.75 కోట్ల వ్యయంతో 240 అభివృద్ధి పనులు, రూ.8.12 కోట్లతో ఇప్పటికే 187 పనులు పూర్తి అయ్యాయని స్పష్టం చేశారు. మిగిలిన అభివృద్ధి పనులు వివిధ దశల్లో ఉన్నాయని వివరించారు.

అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (రుడా)ద్వారా మంజూరైన రూ.కోటి నిధులతో రామదాసు స్ట్రీట్ నుంచి యూ షాపింగ్ కాంప్లెక్స్, మార్కెట్ యార్డు వరకు సీసీ రోడ్డు వేసేందుకు వినియోగిస్తామన్నారు. నిడదవోలుకు గోదావరి జలాలు వాటర్ గ్రిడ్ ద్వారా రూ.83.82 కోట్ల నిధులతో అమృత్ పథకం -2 ద్వారా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాబోయే రోజుల్లో పట్టణంలో అందరికీ నీళ్లు అందిస్తామన్నారు. త్వరలో నిడదవోలు పట్టణంలో 250 సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అఖండ గోదావరి ప్రాజెక్టులో భాగంగా రాజమండ్రి పరిసర ప్రాంతాలతో పాటు ప్రత్యేకంగా రూ.3 కోట్లతో నిడదవోలును పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని మంత్రి దుర్గేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, కమిషనర్ టి. కృష్ణవేణి, కూటమి నాయకులు కొమ్మిన వెంకటేశ్వరరావు, రంగా రమేష్, తిరుపతి సత్యనారాయణ, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.